

రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మల్‌రెడ్డి రాంరెడ్డిని ఇనాంగూడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ బింగి దేవదాసు గౌడ్, అంతటి రవీందర్‌గౌడ్, అంతటి భాస్కర్‌గౌడ్, బబ్బూరి శ్రీశైలంగౌడ్, పల్లె సత్యనారాయణ, అంతటి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు. - అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి



రాష్ట్ర పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్‌గా నియమితులైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పులి నవీన్, బాబుగౌడ్ పాల్గొన్నారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

సరూర్‌నగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లోని వివిధ కాలనీలకు చెందిన పలు విభాగాలకు చెందిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో బుధవారం ఇక్కడి శ్రీసాయిబాలాజీ హోమ్స్ ఫేజ్-2లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో రమాశంకర్, శ్రీరామ్‌శర్మ, చంద్రయ్య, ప్రకాశ్, కిషోర్, చెన్నయ్య పవన్, నందకిషోర్, గిరిప్రసాద్, శ్రీకాంత్, అరుణ్‌గౌడ్, వెంకటేశ్, రాజుగౌడ్, రేవంత్, కృష్ణ, రమణ, అభిలాష్ పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు: కార్పొరేటర్

హయత్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లో ప్రజలు అడ్డగోలుగా నీటి వృథాకు పాల్పడ వద్దని కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి కోరారు. బుధవారం ఆయన బాలాజీనగర్, లెక్చరర్స్ కాలనీతో పాటు పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు నీటి వృథాపై, కలుగుతున్న ఇబ్బందులపై కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవి కాలం వచ్చినందున ప్రజలు జాగ్రత్తగా నీటిని వాడాలన్నారు. కాలనీ నాయకులు సరేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, వెంకటేష్, మోహన్‌రెడ్డి, శ్రీశైలం, శంకర్‌రెడ్డి, మహేంద్రనాథ్, జనార్దన్, రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, కృష్ణ పాల్గొన్నారు.

భారత్ బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ బియ్యం పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ కోరారు. డివిజన్ పరిధిలోని గాయత్రీపురంలో స్థానికుడు నారాయణ నిర్వహిస్తున్న భారత్ బియ్యం విక్రయ కేంద్రాన్ని కార్పొరేటర్ బుధవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రూ.29లకు కేజీ భారత్ బియ్యాన్ని విక్రయిస్తారన్నారు. లబ్ధిదారు మొబైల్ నెంబర్, ఆధార్‌కార్డు వివరాలను నమోదు చేసుకుని బియ్యం విక్రయిస్తారన్నారు. విజయభాస్కర్, మంచి రాజేష్, సుందర్‌నారాయణ, కొత్త తిరుమల్, రాకేష్‌యాదవ్, మహేందర్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, రైక శ్రీనివాస్ పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

కొత్తపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీ వద్ద తెలంగాణ పార్కులో మరిన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్ కుమార్ తెలిపారు. పార్కు సుందరీకరణలో భాగంగా హెచ్ఎండీఏ వారు ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను ఆయన బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీల పరిధిలోని దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని కోరుతూ బుధవారం వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చెమండ్ల గోవర్ధన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ప్రత్యేక కోటాలో వికలాంగులకు రెండు పడకల ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామిదేవి, ప్రసాద్, మల్లేష్, షబ్బీర్, రాంనర్సయ్య, భద్రయ్య, రమేష్, రాజు, నరసింహ పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా కె.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బీ.ఉపేందర్ రెడ్డి, కోశాధికారిగా జీ.రవీందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కె.ప్రసాద్, ఎం.నాగమణిరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎస్.మల్లారెడ్డి, సీహెచ్.వెంకట్‌రెడ్డి, భూపతి రెడ్డి, సలహాదారులుగా రంగారెడ్డి, రాధాకృష్ణ, కృష్ణ, లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

మసీదులో అగ్నిప్రమాదం



మసీదులో జరిగిన అగ్నిప్రమాదంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆజంపురలోని సహిఫా మసీదులో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే స్పందించిన మసీదు కమిటీ సభ్యులు, స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. అగ్నిమాపక దళాన్ని రంగంలోకి దింపి మంటలను అదుపు చేశారు. మసీదులో ప్రార్థనలకు వచ్చిన వారెవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మసీదులోని విద్యుత్‌మీటర్లు, ఫ్యూజ్‌బాక్స్‌లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల మసీదు వద్దకు చేరుకుని ప్రమాదానికి కారణాలపై ఆరాతీశారు. తాత్కాలికంగా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టారు. విద్యుత్ లోడ్ పెరిగిన కారణంగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటుందని చాదర్‌ఘాట్ పోలీసులు భావిస్తున్నారు.

దొంగిలించిన బైకుపై వెళ్తూ మృత్యు ఒడికి

- వేలి ముద్రలతో పాత నేరస్థుడుగా గుర్తింపు



గోపీకృష్ణ

కొత్తపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దొంగిలించిన బైకుపై రాంగ్ రూట్‌లో వెళ్తూ ఓ పాత నేరస్థుడు మృత్యుఒడికి చేరుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి ప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో ఎస్ఐలు శంకర్, దయాకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఒంగోలు నుంచి బోయిన్‌పల్లికి వెళ్తున్న మినీ లారీ/డీసీఎం వాహనాన్ని బైకుపై రాంగ్ రూట్‌లో వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. మృతుడు తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. బుధవారం రాత్రి దర్యాప్తులో ఆధారాలు సేకరిస్తుండగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. మృతుడి వద్ద గుర్తించే ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు వేలిముద్రలు పరిశీలించారు. అతడు ఖమ్మంకు చెంది గోపీకృష్ణ(30) అనే పాత నేరస్థుడుగా గుర్తించారు. అతడిపై ఖమ్మంలో 3 కేసులున్నట్లు తెలుసుకున్నారు. అతడు మంగళశారం రాత్రి సాగర్‌రింగ్ రోడ్డు సమీపంలోని గుడిసెల్లో శత్రు అనే వ్యక్తికి చెందిన బైకును దొంగిలించాడని దర్యాప్తులో తేలింది. అతడు దొంగతనం చేసిన బైకుపైనే పరారవుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని సరూర్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సరూర్‌నగర్ ఎస్ఐ గణేష్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుమారు 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళ మృతదేహం సరూర్‌నగర్ చెరువుకట్టపై ఉన్నటువంటి సరూర్‌నగర్ లేక్ పోలీస్ ఔట్‌పోస్ట్ సమీపంలో నీటిలో తేలడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సరూర్‌నగర్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టు నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. బుర్ఖా ధరించి ఉండడంతో మృతురాలు ముస్లింగా పోలీసులు భావిస్తున్నారు. మృతురాలు లైట్ గ్రీన్ కలర్ డ్రస్, నలుపురంగు బుర్ఖా, గ్రీన్ కలర్ గాజులు, కుడి కాలుకు నలుపురంగు దారం ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. మృతురాలి ఆచూకీ కోసం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి(8712662341,8712662355) ఉస్మానియా మార్చురీలో మృతదేహాన్ని గుర్తించాలని ఎస్ఐ గణేష్ తెలిపారు.

జర్నలిజం వృత్తి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మీడియా సంస్థలదే

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రతిరూపమైన జర్నలిజం వృత్తికి ఉన్న గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత మీడియా సంస్థల నిర్వాహకులకు ఉందని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లో నిర్మించిన క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ మీడియా సంస్థ నూతన భవనాన్ని బుధవారం ఆయన ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, బాలునాయక్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులు కూడా వృత్తికి తగిన గౌరవాన్ని తీసుకురావాలన్నారు. పోటీ ప్రపంచంలో సోషల్ మీడియా విప్లవంతో మీడియా సంస్థల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనిని అదిగమించడం కోసం వాస్తవాలకు భిన్నంగా సంచలనాల కోసం పోటీ పడితే ప్రజల్లో చులకన భావం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారదిగా నిలిచే జర్నలిస్టుల చేతులకు సంకెళ్లు పడ్డాయన్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ కర్తవ్యాన్ని, చిత్త శుద్ధిని అంకితభావంతో నిర్వహిస్తేనే మంచి ఫలితాలు ఉంటామని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ మాట్లాడారు. ఎమ్మెల్సీ రాజేందర్, రాష్ట్ర చిన్న, మధ్యతరగతి పత్రికల అసోసియోషన్ అధ్యక్షులు యూసుఫ్‌బాబు, క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ మీడియా సంస్థ ప్రచురణ కర్త ఎన్. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ఐలయ్య, అనురాధ, మంగమ్మ, సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

మేరు కులస్థులకు చేయూతనివ్వాలి

- మంత్రి పొంగులేటికి మేరు యువజన సంఘం వినతి



మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్

చాదర్‌ఘాట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మేరు కులస్థులకు ఆర్థికంగా, రాజకీయంగా చేయూతనిచ్చి ఆదుకోవడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పొల్కం శ్రీనివాస్ మేరుతో కూడిన బృందం బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మినిస్టర్స్ కోటర్సులో కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పొల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 15లక్షల మంది మేరు కులస్థులున్నారని, ఆర్థిక ఇబ్బందులతో ఇంకా అనేక కుటుంబాలు కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయన్నారు. మేరు కులస్థులను ఆదుకునే కార్యక్రమంలో భాగంగా తక్షణమే ప్రభుత్వం వృత్తిపై ఆధార పడిన 25వేల కుటుంబాలకు కుట్టు మిషన్లతో పాటు ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని కోరారు. రాజకీయాల్లో మేరు కులస్థుల్లో ఏ ఒక్కరు కూడా లేరని, రాజకీయాల్లోనూ ప్రాధాన్యతనిచ్చి ఎదిగేలా ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఇళ్లు లేని నిరుపేద మేరు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి ఆదుకోవాలని కోరారు.

విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్ల ఆందోళన

- నెలల తరబడి ఎల్‌సీలు ఇవ్వటం లేదని ఆవేదన



మాట్లాడుతున్న ఎస్ఈ కరుణాకర్‌బాబు

మన్సూరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కొత్త ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్‌లు, ఇతర విద్యుత్ మరమ్మతుల కోసం నెలల తరబడి లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) ఇవ్వకుండా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని నిరసిస్తూ తెలంగాణ విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు బుధవారం ఆటోనగర్‌లోని ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రెండు నెలలకు పైగా ఎల్‌సీలు ఇవ్వకపోవటంతో తాము పనులెలా చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ప్రతినిధులు శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా నిర్మితమైన అపార్టుమెంట్లకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు వేసవి కాలం కావడంతో విద్యుత్ వినియోగం పెరిగి విద్యుత్ మీటర్ల కేటగిరి మార్పులు చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా పనులకు అధికారికంగా అనుమతులు పొంది, వర్క్ ఆర్డర్లు కూడా వచ్చిన తర్వాత పనులు చేపట్టేందుకు నెలల తరబడి వేచి చూడాల్సి వస్తుందన్నారు. సుమారు 70 రోజులుగా ఎల్‌సీ ఇవ్వటం లేదని, వినియోగదారుల నుంచి తాము తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అంతేకాకుండా బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఎల్‌సీ ఇస్తున్నామని, పనులు చేసుకోవాలని మంగళవారం అధికారులు చెప్పారన్నారు. ఈ క్రమంలో తాము పనులకు అన్ని ఏర్పాట్లు చేసుకున్న తర్వాత ఎలాంటి ఎస్‌సీ ఇవ్వటం లేదని గంట ముందు చెప్పారని, ఉన్నతాధికారుల ఆదేశాలంటూ తప్పించుకోవటం ఎంత వరకు సమంజసమన్నారు. వందల మంది పని మనుషులను రెడీ చేసుకున్న తర్వాత అధికారులు ఎల్‌సీ ఇవ్వమని చెబితే.. వారికి కూలి ఎవరు ఇవ్వాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న వారితో ఎస్ఈ కరుణాకర్‌బాబు మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉండవద్దని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలతోనే తాము ఎల్‌సీలు ఇవ్వటం లేదని తప్పించుకుంటున్నారని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల మార్పిడి, ఇతర మరమ్మతుల కోసం ఎల్‌సీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు ప్రదీప్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హమాలీ చార్జీలను పెంచాలి : సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని బాటసింగారం పండ్ల మార్కెట్‌లో పని చేస్తున్న కార్మికుల హమాలీ చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇచ్చిన మాట ప్రకారం హమాలీ చార్జీలను వెంటనే పెంచాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ 2021 సంవత్సరంలోనే మార్కెట్ అధికారులకు డిమాండ్ నోటీసులను ఇచ్చినట్లు తెలిపారు. చార్జీల పెంపు విషయంలో మార్కెట్ కమిటీ సెక్రెటరీ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రెండు ఏళ్లుగా కార్మికులకు లైసెన్సులను కూడా జారీ చేయడం లేదన్నారు. చార్జీలు పెంచకుండా కార్మికుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. మార్కెట్ కమిటీ అధికారులతో పాటు కార్మికులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలకు పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు యూనిఫామ్స్‌తో పాటు షూలను అందించాలన్నారు. సమస్య పరిష్కారానికి మార్కెట్ సెక్రెటరీ చొరవ తీసుకోవాలన్నారు. హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరయ్య, పోచయ్య, షరీఫ్, బుచ్చయ్య, ఊతప్ప, మున్నా, మసూద్, రాములు, శంకర్ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

- ముగ్గురు నిందితులకు బేడీలు
- రూ.1.50లక్షల నగదు స్వాధీనం



పట్టుబడిన ముఠా

హైదరాబాద్ సిటీ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తూ.. మోసాలకు పాల్పడుతున్న ముఠా ఆటకట్టించారు సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. వారి వద్ద నుంచి రూ. 1.50 లక్షల నగదు, రెండు ల్యాప్‌టాప్‌లు, 5 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పేరుమాల్ తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఉదయ్ సింహారెడ్డి, ఫహీముద్దీన్, ఎం. బానుప్రసాద్‌లు స్నేహితులు. వారికి ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై అవగాహన ఉంది. దాంతో క్రికెట్ అభిమానులను బెట్టింగ్‌లో పాల్గొనేలా చేసి అడ్డదారిలో డబ్బు సంపాదించాలని పథకం వేశారు. అనుకున్నదే తడవుగా హ్యాపీబెట్‌ప్లే డాట్‌కామ్, హ్యాపీ క్రికెట్ డాట్ కామ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసి, ప్రధాన ఆర్గనైజర్స్ ద్వారా పాస్‌వర్డ్ పొందారు. స్నేహితులు, తెలిసిన వారి ద్వారా పంటర్స్‌ను ఆకర్షించి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో పాల్గొనేలా చేశారు. ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా డబ్బులను తీసుకోవడం, గెలిచిన వారికి సైతం ఆన్‌లైన్‌లోనే డబ్బులు చెల్లించే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈనెల-19న మంగళవారం లెజెండ్స్ క్రికెట్ ట్రోఫి-2024లో భాగంగా.. శ్రీలంక పల్లెకేలే ఇంటర్నేషనల్ స్టేడియంలో న్యూయార్క్ సూపర్‌స్టార్ స్ట్రైకర్స్ వర్సెస్ రాజస్థాన్ కింగ్స్ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దాంతో టాస్క్‌ఫోర్స్, సుల్తాన్‌బజార్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుడ్ కోర్టు డబ్బాలో పేలిన సిలిండర్

- తప్పిన పెనుప్రమాదం..
- సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం



తగలబడుతున్న ఫుడ్ కోర్టు

వనస్థలిపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) : ఫుడ్‌కోర్టు డబ్బాలో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలడంతో సుమారు రెండు లక్షల ఆస్తినష్టం జరిగిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుష్మ చౌరస్తా నుంచి రైతుబజార్ రోడ్డులోని పెట్రోల్ బంక్ ముందు వనస్థలిపురానికి చెందిన త్రీత్‌పాల్ సింగ్(27) కొంత కాలంగా రేల్ ఎక్స్‌ప్రెస్ ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగా త్రీత్‌పాల్ సింగ్ బుధవారం ఉదయం వనస్థలిపురానికి చెందిన సీతల సుబ్బారావు(35) దుర్గా దంపతులకు తన ఫుడ్ కోర్టు డబ్బాను అద్దెకు ఇచ్చాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం 5.40నిమిషాల సమయంలో డబ్బాలో వంటలకు ఉపయోగించే గ్యాస్ సిలిండర్ లీక్ అయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సుబ్బారావు దుర్గా దంపతులు భయంతో భయటకు పరుగులు తీసారు. ఈ క్రమంలో మంటలు ఎక్కువ కావడంతో పక్కనే ఉన్న బ్యాగుల డబ్బా షాపుకు వ్యాపించాయి. ఆ సమయంలో సిలిండర్ పేలడంతో అక్కడ ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో రెండు డబ్బాల్లో ఉన్న సుమారు రెండు లక్షల విలువచేసే వంట సామగ్రి, బ్యాగులు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. కేసు నమోదు చెసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కాలిబూడిదైన డబ్బాలోని సామగ్రి

అంధ విద్యార్థులకు చేయూత

చాదర్‌ఘాట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం చేయూత కార్యక్రమంలో భాగంగా బీరువా, కుర్చీలు, కార్పెట్‌లు, టేబుళ్లను అందజేసింది. క్లబ్ ప్రతినిధి నాచం ప్రభాకర్, క్లబ్ అధ్యక్షుడు వరకుమార్, ప్రధాన కార్యదర్శి మంచాల అంబరీష్, కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని బలిజగూడ గ్రామంలోని చారిత్రాత్మక ఆలయంలో వీరభద్రస్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం స్వామి వారికి అభిషేకం, రాత్రి 7గంటలకు కల్యాణ వేడుకలను నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండాలు, రథోత్సవం నిర్వహించారు.

ఘనంగా శ్యాంబాబా నిషాన్ శోభాయాత్ర

చాదర్‌ఘాట్ : మూసారాంబాగ్‌లోని లక్ష్మీనగర్ కాలనీలో బుధవారం శ్యాంబాబా నిషాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర లక్ష్మీనగర్‌కాలనీ వరకు సాగింది.

బ్రెయిన్‌డెడ్ శరీరం నుంచి అవయవాల సేకరణ

మన్సూరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి శరీరం నుంచి కామినేని ఆస్పత్రి వైద్యులు అవయవాలను సేకరించారు. ఆస్పత్రి ప్రతినిధుల కథనం ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న చిల్కరాజు రాములు కూలీ చేస్తుంటాడు. ఈనెల 15న తెల్లవారుజామున ఇంట్లో బాత్‌రూంలో జారి పడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు అతన్ని ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అందించిన వైద్యులు అతను బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు మంగళవారం ప్రకటించారు. కుటుంబసభ్యుల అనుమతితో అతని శరీరం నుంచి లివర్, కిడ్నీలు, కంటి శుక్లాలను సేకరించారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

చంపాపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఫిరోజ్‌ఖాన్ తాగిన మత్తులో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య గత కొన్ని నెలల నుంచి అతనికి దూరంగా ఉంటుంది. అనారోగ్య కారణాలతో ఫిరోజ్‌ఖాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫాతిమాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపారు.

లష్కర్ బరిలో పజ్జన్న?



హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్(పజ్జన్న) బరిలో దిగే అవకాశాలున్నాయి. ఈమేరకు పార్టీ అగ్రనేతలు సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నేడు లేదా 23వ తేదీ తర్వాత అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అగ్రనేతల సంకేతా ల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు కంగ్రాట్స్ పజ్జన్న అంటూ.. వా ట్సప్ స్టేటస్‌లు పెట్టుకున్నారు. దీంతో ఆయన పేరు ప్రకటించడం లాంఛనమే అ న్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు పలువురు నాయకుల పేర్లు తెరపైకి వచ్చినా, చివరి నిమిషంలో పద్మారావును బరిలోకి దింపాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. గ్రేటర్‌లో పార్టీకి బలం ఉండడం.. ప్రజలకు తెలిసిన నాయకుడిని పోటీ చేయించడం ద్వారా విజయావకాశాలు మెరుగవుతాయన్నది పార్టీ యోచనగా తెలుస్తోంది.

తలసాని విముఖత..

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌వాసులు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. 24 స్థానాల్లో 16 చోట్ల గులాబీ జెండా ఎగిరింది. ఈ పరంపరను లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తోంది. సికింద్రాబాద్ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనయుడు సాయికిరణ్ పోటీ చేస్తారని మొదటి నుంచీ ప్రచారం జరిగింది. పార్టీ అధిష్ఠానం మాత్రం శ్రీనివాస్‌యాదవ్‌ను పోటీచేయాలని సూచించినట్టు తెలిసింది. అందుకు ఆయన సుముఖంగా లేకపోవడంతో పద్మారావుగౌడ్ వైపు పార్టీ మొగ్గు చూపినట్టు సమాచారం. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. ఇటీవల ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హస్తం గూటికి చేరారు. పార్లమెంట్ స్థానంలో మంచి ఆదరణ ఉందని భావిస్తోన్న పార్టీ.. బలమైన నాయకుడిని పోటీ చేయించడం ద్వారా ఇక్కడ ఖాతా తెరవాలనే తలంపుతో ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే పద్మారావుకు అవకాశం ఇచ్చినట్టు సమాచారం.

నగర రాజకీయాలతో ఐదు దశాబ్దాల అనుబంధం..

నగర రాజకీయాలతో పద్మారావుకు ఐదు దశాబ్దాల అనుబంధముంది. 1973లో దివంగత ఇందిరాగాంధీ సమక్షంలో పద్మారావు యువజన కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం యువజన కాంగ్రెస్ నగర, రాష్ట్ర పదవులు నిర్వహించారు. 1977 నుంచి జంటనగరాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1986లో హిస్సాంగంజ్ మోండా మార్కెట్ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు. 1991వరకు కార్పొరేటర్‌గా కొనసాగారు. 2001లో కేసీఆర్ పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2002 నుంచి 2004 వరకు మళ్లీ కార్పొరేటర్‌గా ఉన్నారు. 2004లో తొలిసారిగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2014, 2018, 2023లలో కూడా ఆయన అదే పార్టీ నుంచి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. 2014 జూన్‌లో తెలంగాణ రాష్ట్ర తొలి ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి 2023 వరకు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. పార్టీలకతీతంగా నగరంలోని చాలా మంది నేతలతో పద్మారావుకు సత్సంబంధాలున్నాయి. ఇది ఎన్నికల్లో ఎంత మేరకు ఉపకరిస్తుందన్నది ఆసక్తికరం కానుంది.

మారుతున్న పేర్లు..

బీజేపీ నుంచి సిటింగ్ ఎంపీ కిషన్‌రెడ్డి పేరు ఇప్పటికే ఖరారైంది. ఆయన ప్రచారమూ ప్రారంభించారు. ఊహించని పరిణామాలు జరిగితే తప్ప బీఆర్ఎస్ నుంచి పద్మారావుగౌడ్ పోటీ దాదాపు ఖాయమే. కాంగ్రెస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగిందని, అధికారిక ప్రకటనే తరువాయి అని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. తొలుత కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు వినిపించింది. ఆయన సన్నిహితులు కూడా టికెట్ తమ నేతకే అని, రెండో జాబితాలో పేరు ఉంటుందని చెప్పారు. రామ్మోహన్ కూడా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. కిషన్‌రెడ్డి, పద్మారావుగౌడ్, నాగేందర్/రామ్మోహన్‌లో ఎవరు బరిలో ఉన్నా.. ఇక్కడి హోరాహోరీగా త్రిముఖ పోరు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



మన్సూరాబాద్ డివిజన్ బాలాజీనగర్‌కాలనీలో శివ ఆంజనేయస్వామి సహితరామాలయం భూమిపూజలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. - మన్సూరాబాద్ ఆంధ్రజ్యోతి

అయ్యప్పస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చంపాపేట: బైరామల్‌గూడ సాగర్‌రింగ్‌రోడ్ డిఫెన్స్ కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయం 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, మంగళవాయిద్య సంహోషణ, గోపూజ, పుణ్యాహవచనం, అఖండ దీపస్థాపన, దీక్షాధరణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హోమం, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ హారతి నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గడ్డం మంగారెడ్డి, ఆలయ డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, విజ్ఞేశ్వర్‌రెడ్డి, మిరియాల అంజయ్యగుప్తా, హరీష్‌రెడ్డి, నిర్మలేష్‌గుప్తా, హరిగుప్తా పాల్గొన్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

- ముగ్గురు అరెస్టు, 152 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లో బుధవారం రాత్రి బెల్టు షాపులపై పోలీసులు దాడి చేసి, ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 152 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్‌నగర్, భరత్‌నగర్, హస్తినాపురంలో అక్రమంగా బెల్టు షాపులను నిర్వహిస్తున్న జగత్‌రెడ్డి, రహీం, యాదవ్‌లను అరెస్టు చేశారు. రాబోయే ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మద్యం బెల్టు షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌హెచ్ ఓ రామాంజనేయులు తెలిపారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

హైదరాబాద్, మార్చి 20: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స అందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. హైదరాబాద్‌లోని బాలాపూర్ రోడ్డు, ధాతు నగర్ కమ్యూనిటీ హాల్, రోడ్ నం.10, జై జగదాంబ ట్రేడర్స్ ఎదురుగా ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో నాలుగు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు.

చికిత్స పొందిన మహిళ మాటల్లో:

గతంలో ఒక మహిళ పులిపిర్లతో (అంతర్భాగాలు) ఎవరికి చూపించలేక బాధపడుతుండగా స్త్రీలకు ఇక్కడ ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నారని తెలిసి ఇక్కడికి రాగా పరిష్కారం లభించడంతో సంతోషంగా ఉందని తెలిపారు. మరికొందరితో చర్చించి చికిత్సను గురించి పూర్తిగా తెలియపరిచి వారిని కూడా తనతో పాటు ఇక్కడికి తీసుకురావడం వారు కూడా చికిత్స అనంతరం సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఈ వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9440251969 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.